# ఒక్క క్షణం

చలికాలం

ఉదయం ఎనిమిది గంటల వేళ ఓపెన్ బాత్‌రూమ్ స్నానం చేస్తున్నాడు పరమేశం.

చలి విపరీతంగా ఉంది. బడబడా రుద్దేసుకుని బుడ బుడా వంటి మీద దిమ్మరించుకుంటున్నాడు చన్నీళ్లు.

మూడవ రౌండు సబ్బు ముఖానికి పులుమేసుకొని కిందకు వంగాడు చెంబుకోసం.

"యురేకా, యురేకా!" వంటగదిలోంచి భార్య కేకలు.

'ఏమై వుంటుందబ్బా? గ్యాస్‌గానీ లీక్‌అయిందా?' ఉన్న పళంగా నీళ్ల బకెట్‌తోనే వంటగదిలోకి పరుగెత్తాడు. కంగారు కంగారుగా ఉంది.

లోపల భార్య నిక్షేపంగా వుంది.

'యురేకా, యురేకా!' అని అరుస్తోంది, నాట్యం చేస్తూ.

"ఏమొచ్చిందే మాయరోగం? ఇప్పటి దాకా బాగానే వున్నావుగా?" అన్నాడు కోపంగా.

"అమ్మయ్య వచ్చేశారా? రండి రండి." సంతోషంగా చేతులు విదిలిస్తూ అంది.

"ఈ బక్కెట్ ఏమిటీ లోపలికి తెచ్చారు!" ఆశ్చర్యంగా అంది.

"నీవేమైనా తగలబడ్డావేమోనని" అన్నాడు విసుగ్గా, అసహనంగా.

"అదికాదండీ నేనండీ... మరండీ... నేనండీ..."

"త్వరగా చెప్పిచావ్వే. కళ్లలో సబ్బుపడి మండుతోంది." కళ్ళు మూస్తూ తెరుస్తూ అన్నాడు.

అయినా తాయారు కోపగించుకోలేదు. తన ఆనందంలో తానుంది.

"గుడ్‌న్యూస్. మీరెళ్లి స్నానం త్వరగా ముగించి రండి చెప్తాను." భర్తను బయటికి తోసింది.

హడావిడిగా స్నానం ముగించి లుంగీ కట్టుకుని లోపలికి నడిచాడు.

అప్పటికే డైనింగ్ టేబుల్ మీద ప్లేట్‌లో అన్నం వడ్డించి భర్త రాకకై నిరీక్షిస్తోంది బుగ్గన చేయిచేర్చి.

"ఏం తాయారు! ఈ పూట స్పెషల్ ఏం చేశావ్?" అడిగాడు వస్తూ...

"యురేకా! యురేకా"

"మళ్లీ ఏం పోయేకాలం వచ్చిందే" దీర్ఘంతీస్తూ...

"ఎందుకండీ ఊరికే మూతి విరిచేసుకుంటారు" అంది కోపంగా. "ఈరోజు మీకోసం సరికొత్త స్పెషల్ కూర తయారుచేశాను. ఎంత కమ్మటి వాసన వేస్తుందో... ఆనందం దాచుకోలేక యురేకా, యురేకా అని అరుస్తే మీరేమో గైమని నోరు చించేసుకుంటున్నారు." మూతి మూడొంకర్లు తిప్పుతూ తనే అంది.

"అబ్బా తొందరగా వడ్డించవే స్పెషల్." లొట్టలు వేస్తూ భార్యవైపు ఆశగా చూశాడు.

వడ్డించింది స్పెషల్.

"ఏమిటే ఇది ఘుమఘుమలాడిపోతోంది."

"తమలపాకుల పచ్చడి."

"ఆ..!" నోరు తెరిచి ఆశ్చర్యంగా చూశాడు భార్యవైపు.

"అవునండీ.. ఎంత కమ్మని వాసన వేస్తుందో..." అని మరికాస్త వడ్డించింది.

"చాలు చాలు ప్రేమ ఎక్కువైతే విషంగా మారుతుంది." భార్య చేతిని

తీసివేస్తూ అన్నాడు.

స్పెషల్‌తో రెండు ముద్దలు లాగిచించేసి గుడ్లప్పగించాడు పరమేశం. వారం రోజుల క్రితం తిన్న తిండి– బోరింగ్ పెట్టి కొట్టినట్లుగా బయటకు తన్నుకొస్తోంది. "పరమశివుడు గరళాన్ని గొంతులో దాచుకున్నాడని విన్నాను. ఈ స్పెషల్ పచ్చడి నాలుకమీద వేసుకుచూడమను", అనుకున్నాడు మనసులో.

"ఏమోయ్ తారూ... వాట్ ఎ వండర్ ఫుల్ టేస్ట్! అద్భుతం, మహా అద్భుతం! నీలాంటి భార్య దొరకటం నూటికి నూరు పాళ్లు నా దురదృష్టం.... ఛ, ఛ కాదు కాదు అదృష్టం! ఈ శుభసమయంలో ప్రేమగా నీకు రెండుముద్దలు తినిపించాలనుందోయ్."

"ఎంత ప్రేమండీ నేనంటే మీకు." మురిసిపోతూ దగ్గరకు వెళ్లింది.

'ప్రేమా, పచ్చిబద్దలా, రెండు ముద్దలు తిని చూడు నరకం గేటు దగ్గరకెళ్లొస్తావ్.' కసిగా అనుకున్నాడు మనసులో.

ప్రేమగా రెండు ముద్దలు తినిపించాడు. మరింత ప్రేమగా మరిరెండు ముద్దలు తినిపించాడు.

ప్రేమ ఎక్కువైతే విషమెలా అవుతుందో బోధపడింది తాయారుకు. మారు మాట్లాడకుండా బయటకు నడిచింది. భర్త మరోముద్ద తినిపించబోతే "భగవాన్, ఏమిటీ ఈ తమలపాకుల పచ్చడి పరీక్ష ?" పైకే అని, బయటికి పరుగెత్తింది తాయారు. కంచంలో చేయి కడిగి లేచాడు, పరమేశం.

బయట వాంతి చేసుకుంటోంది తాయారు.

"ఏమోయ్ తారూ నెలతప్పావేమిటి? ఎంత అదృష్టం నాకు. ఏడుకొండలవాడా, వెంకటరమణా, గోవిందా, గోవిందా! నీ కొండకొచ్చి వెయ్యినూటా పదహారు కొబ్బరికాయలు కొడతాను స్వామీ."

"అబ్బ అరవకండి. నెల తప్పలేదు. సంవత్సరం తప్పలేదు. ముందు మందులషాపుకెళ్ళి వాంతులు తగ్గటానికి మాత్రలు పట్రండి." అంది తల

పట్టుకొంటూ.

ముసి ముసిగా నవ్వుతూ బయటకు నడిచాడు పరమేశం, తాయారుని ముడివేసుకొని మూడు సంవత్సరాలయింది. మేనమామ కూతురవడం వలన ఇష్టంలేకపోయినా కట్టేశారు. తాయారు పెద్దగా చదువుకోలేదు. స్కూల్ ఫైనల్‌ను కాలేజి ఫైనల్‌గా భావించి"చదివి రాజ్యాలేల్నా?"అంటూ చదువు మాన్పించారు ఆమె తల్లిదండ్రులు. తరువాత తాయారు పెద్ద రచయిత్రుల నవలలన్నీ పిండి జల్లించినట్లు జల్లించేసి, నవలా ప్రపంచంలో మకుటంలేని మహారాణి కావాలనే ప్రయత్నంలో, వారంరోజులు వంటమానేసి మొగుణ్ణి మూడుకిలోలు తగ్గించేసింది. పరమేశం ఓ ఐదురోజులు ఆమరణ నిరాహార దీక్ష పూనిన అనంతరం నవలలు రాయటం నిలిపేసి, సరికొత్త వంటలు తయారు చేయటం మొదలెట్టింది.

పరమేశానికి మంగతాయారు పేరు ఇష్టముండేదికాదు. ఇదేమిటి హోటల్ ముందు "భోజనం- తయారు" బోర్డు లాగా అనుకునేవాడు. తరువాత తారు అనిపిలవడం మొదలెట్టాడు ముద్దుగా.

ఆఫీసు పని వొత్తిడివల్ల ఆరోజు ఆలస్యంగా, విసుగ్గా ఇంటికొచ్చేసరికి మంచంమీదా మంగతాయారు ముసుగుతన్ని ఉంది. పక్కనే టేబుల్‌మీద కాఫీ ఫ్లాస్క్

దగ్గరగావెళ్లి చేయిపట్టుకు చూశాడు. చల్లగానే వుంది. 'మరి ముసుగు ఎందుకేసినట్టబ్బా' ఆలోచిస్తున్నాడు.

"ఒంట్లో బాగాలేదా అలా పడుకున్నావు," అడిగాడు.

ముసుగు తొలిగించి ఒక్కసారి తీక్షణంగా చూసి మరోవైపుకు తిరిగి పడుకుంది.

తల ప్రక్కగా పుస్తకం కనిపించింది. చేతిలోకి తీసుకొని చూశాడు. 'తిరుగుబాటు' అనే నవల అది.

"తారూ, ఈ నవల చదివేవా?" గాబరాగా అడిగేడు. ఉలుకూ పలుకూ

లేదు. దుప్పటి మరింత బిగతన్నింది, అయితే ఖచ్చితంగా ఆ నవల చదివుంటుంది. నాలుగు కప్పులు కాఫీ మరీ ఏడ్పించుతుంది. వంటచేసిన జాడ లేదు. ప్చ్ లాభంలేదు!

అది కొత్తకాదు అలాంటి నవలలు చదివినప్పుడల్లా అంతే... భర్తను మాడ్చేస్తుంది. ఇదేమని అడిగితే మరో రెండు రోజులు కుంపటి అంటించదు.

వంట మొదలెట్టి, విఫలమై - హోటల్‌కు వెళ్లాడు పరమేశం.

మరుసటి రోజు ముఖం కడుగుతుంటే పక్కింటి బామ్మగారు అడిగింది.

"రాత్రి, అబ్బాయే వంటచేసినట్లున్నాడు."

"అవునండీ, వంట నేర్చుకుంటానంటేనూ," నసిగింది.

"తొందర్లో పుట్టింటికి వెళ్లబోతున్నావన్నమాట."

"అబ్బే అదేంకాదు వంటనేర్చుకుంటానని మావారు కాస్త సరదాపడితేనూ" అంది చిరునవ్వు నవ్వుతూ.

తల పట్టుకొని కూర్చున్నాడు లోపల అంతా విన్న పరమేశం. తలబాదుకొని తన కోపమంతా తీర్చుకున్నాడు.

పరమేశం ఆ ఇంటిలో అద్దెకు దిగి ఆరు నెలలవుతోంది. ఆ యింటికి ఆనుకొనే బామ్మగారి ఇల్లు. వచ్చిన రెండు రోజులలోనే రెండిళ్లమధ్యా ఉన్న అడ్డుగోడ అధిరోహించేసింది తాయారు.

ఆఫీస్‌కు టైమ్ అవుతోంది. స్నానం చేసే బకెట్ కోసం ఇల్లంతా గాలించాడు. ఎక్కడా కనిపించలేదు.

"ఏమే తారు! బకెట్ ఎక్కడ దాచావే?" పెద్ద గావుకేక వేశాడు కోపంగా.

తాయారు గోడనానుకొని బామ్మగారితో రామాయణం మాట్లాడుతోంది.

"అబ్బా వస్తున్నా, ఒక్క క్షణం ఆగండి," విసుగ్గా అరంగుళం కూడా కదలకుండా అంది పెద్దగానే.

రామాయణం మొదలై అప్పటికి అరగంట.

"ఏమే మీ నాన్నకు టెలిగ్రాం ఇవ్వమంటావా పోయానని," అసహనంగా కేకేశాడు.

"మళ్ళీ వస్తాను బామ్మగారూ. క్షణంకూడా ఊపిరాడనీయరనుకోండి" అని ఒక్క వేడి నిట్టూర్పు విడిచి, గోడప్రక్కనే బోర్లించి తాను నిలుచుని ఉన్న బక్కెట్‌ను దిగి, లోనికి పట్టుకెళ్లింది.

భర్త ఆఫీసుకెళ్ళిన తరువాత బామ్మగారితో మళ్ళీ బాతాఖానీ.

"బామ్మగారూ, అరటికాయతో ఆవకాయ పెట్టాలనుంది, ఎలావుంటుందంటారు." అడిగింది బుగ్గన చెయ్యి ఆనించి.

ఆ ఇంట్లో దిగిన మూడురోజుల్లోనే తాయారు మనస్తత్వం పూర్తిగా చదివేసిన బామ్మగారు, " అరటి కాయతో ఆవకాయ ఏమిటి, మిగిలిన అరటి తొక్కలతో హల్వా కూడా చేసుకోవచ్చు." అంది వ్యంగ్యంగా.

అదేం గమనించని తాయారు చెప్పుకుపోతోంది.

"మరిచి పోయాను. వారం రోజులనుంచి ఒకటే జలుబు" ఎన్ని మందులు వాడినా తగ్గటం లేదు. మీకేమన్నా చిట్కా వైద్యం తెలిస్తే చెప్పరూ..." అడిగింది తాయారు ఆశగా.

"చిట్కా వైద్యాలు ఈరోజుల్లో సరిగా పనిచేయటంలేదమ్మా. అప్పటి రోగాలు వేరు, ఆ మందులు వేరు. అప్పటి తిండి కూడా వేరు. అయినా ఓ చిన్న చిట్కా చెబుతాను జాగ్రత్తగా విను. అశోక్ థియేటర్ ఉంది చూసేవూ.... అందులో 'కన్నీరు... మున్నీరు' సినిమా ఆడుతోంది. ఒక్కసారి చూసొచ్చావంటే దెబ్బకు తగ్గిపోవచ్చు.

క్షణం ఆగి,

"ఆఁ.. మరచే పోయాను. వెంట ఓ టవల్ కూడా పట్టుకెళ్లు." ఉచిత సలహా పారేసింది.

ఆ మధ్యాహ్నమే సినిమాకెళ్లి హుషారుగా ఇంటికి తిరిగొచ్చింది, తాయారు. బామ్మగారి చిట్కా బాగా పనిచేసింది అనుకుంది.

ఆ రాత్రికి స్పెషల్ వడియాలు తయారు చేసి ప్రేమగా భర్తకు వడ్డించింది.

"తారూ"

"ఊc..."

"త్రేతాయుగంలో రాముడు సీతకి అగ్ని పరీక్ష పెట్టింది ఒక్కసారే అవునా?"

"అవును"

"ఈ అణు యుగంలో నాకు రోజూ అగ్ని పరీక్షలేనా" అన్నాడు, పన్నూడినట్లుంటే దవడ గట్టిగా పట్టుకొని.ఆమె చేసిన కొత్త వంటకం ప్రభావం!

"మీకన్నీ అలానే వుంటాయి. నేసంటే మరీ అంత చులకనైపోయాను." అంది ముక్కు పైకిపీల్చుతూ, కొంగు కళ్లకద్దుకుంటూ.

"వర్షం కురిపించకేతారూ, నీవు ప్రేమతో బండరాళ్ళు పెట్టినా ఇనప్పళ్ళు కట్టించుకొని మరీ నమలతానే."

అదే అదనుగా మరికొన్ని వడ్డించింది.

రాత్రి చలిగాలి రివ్వున వీస్తోంది. పరమేశం భార్యతో సరసాలాడుతున్నాడు.

"తారూ ఈ పండు వెన్నెల భగ్నం చేయకుండా ఓ పాట వినిపించు" అన్నాడు తెలుగు సినిమా హీరోలా.

"అబ్బా, ఉండండి. ఓక్షణం బామ్మగారితో మాట్లాడి వస్తా," చర చరా వెళ్ళిపోయింది.

ఒక్క క్షణం, ఒక్క క్షణం... వంద క్షణాలు గడిచిపోయాయి.

పరమేశం ఇక ఆపుకోలేక, తన గురకపాట తాను మొదలెట్టాడు.

(మయూరి సచిత్ర వారపత్రిక 1 నవంబర్ 1985)